2010 కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కే.రాజు

విశాలాంధ్ర-పాయకరావుపేట: 2010 కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కే.రాజు మాట్లాడుతూ 30 సంవత్సరాల సర్వీస్ గల ఉపాధ్యాయులు టెట్ రాస్తేనే ఉపాధ్యాయులుగా అర్హులనటం అర్థం లేదన్నారు. డాక్టర్లు, లాయర్లు, పోలీసులు మరలా అర్హత పరీక్ష రాయాలంటే సమంజసంగా ఉంటుందా అని ప్రశ్నించారు. అనంతరం తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కట్టా లోవరాజు, శ్రీరామచంద్ర మూర్తి, ప్రసూనాంబ, అపర్ణ, డి.ఐజాక్, లక్ష్మణరావు, సూరిబాబు, గోపాలరావు, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫాస్ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర -వి.మాడుగుల: బుధవారం మాడుగుల ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫాస్ వ్యాధిపై మండలానికి సంబంధించి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. స్క్రబ్ టైఫాస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కింతలి, కేజేపురం ప్రభుత్వ వైద్యాధికారులు పి.ప్రసాద్‌పాత్రుడు. టి.శ్రీను మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు ఈ వ్యాధిపై ముందు జాగ్రత్తలు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని వైద్యులు అన్నారు. ఇది ప్రమాదకరమైన వ్యాధి కాదని ఈ వ్యాధి కాగానే ముందుగా జ్వరం వస్తుందని శరీరం షేక్ అవుతుందని, శ్వాస ఆడడం కష్టంగా ఉంటుందని వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సంప్రదిస్తే వెంటనే వారికి టెట్రా సైకిల్న్‌తో పాటు డాక్సీసైకిల్న్ ఇంజక్షన్ గాని టాబ్లెట్స్ గాని వేసుకోవడం ద్వారా ఈ వ్యాధి వెంటనే తగ్గిపోతుందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో పి.గౌరీ శంకర్, డిప్యూటీ ఎంపీడీవో పిఎల్.సతీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యము కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచి దాడి ఏరుకు నాయుడు సహకార పరపతి సంఘం అధ్యక్షులు రాజి నారాయణమూర్తి(నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యవర్తులు దళారులు లేకున్నా ప్రభుత్వ నిబంధనల ప్రకారము ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్ర వద్ద ధాన్యము అమ్ముకోవచ్చునన్నారు. ధాన్యము కొనుగోలు కేంద్రానికి తెచ్చినందుకు అయ్యే రవాణా ఖర్చులు. సంచులు. కూలీల. తోపాటు రైతు ఇచ్చిన ధాన్యము ఖరీదును రైతు అకౌంట్లో రెండు రోజుల్లోగా జమ చేయబడుతుందన్నారు. ముందుగా రైతులు రైతు సేవా కేంద్రం వద్ద బయోమెట్రిక్ వెయ్యాలన్నారు. ప్రభుత్వము చూపించిన ప్రమాణాలకు లోబడి రైతులు ధాన్యమును తూనిక కేంద్రాలకు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం ముఖ్య కార్యనిర్వాహక అధికారి బత్తిన సత్యనారాయణమూర్తి. జనసేన పార్టీ మండల నాయకులు కుంచ అంజిబాబు. బోర్డు డైరెక్టర్లు గొర్లె శంకర్రావు. ఈర్లే దేవుడు బాబు. సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

విశాలాంధ్ర-మాకవరపాలెం: గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరి నిందితులకు మూడు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం 1వ అదనపు జిల్లా & సెషన్స్ కోర్టు తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మాకవరపాలెం ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదు చేసిన గంజాయి అక్రమ రవాణా కేసులో తమిళనాడు రాష్ట్రంనకు చెందిన గోవిందరాజ్ సెల్వరాజ్, రాజమణిలకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి ?.5,000 జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించనట్లయితే అదనంగా 2 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం 1వ అదనపు జిల్లా & సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటనారాయణ ఈ రోజు తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాకవరపాలెం పోలీసులను అభినందించారు. అమ్మకాలపై ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు వివరించారు. ఈ ఏడాది ధాన్యం సాధారణ రకం రూ.2369, గ్రేడ్ %ూ% రకం రూ.2389 ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు గంజాయి రహిత సమాజాన్ని నిర్మూలించెందుకు సహకరించాలి

విశాలాంధ్ర-చీడికాడ: విద్యార్థులు గంజాయి రహిత సమాజాన్ని నిర్మూలించుకునేందుకు సహకరించాలని ఎస్సై సతీష్ అన్నారు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలమేరకు మండలంలోని మంచాల ఏ పి మోడల్ స్కూల్ లో విద్యార్థులకు సంకల్పం అను అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ గంజాయి రవాణా చేయడం పండించడం కలిగి ఉండడం ఎన్డీపీఎస్ చట్టప్రకారం నేరమన్నారు ఈ కేసులో ప్రేమేయం ఉన్నట్లయితే 20 సంవత్సరాల వరకు కఠిన కారాగాల శిక్ష పడుకుందని అన్నారు రెండు కన్నా ఎక్కువ కేసులు ఉన్న వారికి పిఐటీ యన్ డియస్ మరియు ఆస్తులు జప్తు వంటివి చేయడం జరుగుతుందన్నారు విద్యార్థిని విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు గంజాయి నిర్మూలన కోసం 1972 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు వారి వివరాలు గోప్యంగా ఉంచుతమని అన్నారు.

టౌన్ షిప్ కు భూములు ఇచ్చేది లేదు....

విశాలాంధ్ర-నక్కపల్లి : ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్ కు భూములు ఇవ్వమని నక్కపల్లి మండలం, నెల్లి పూడి గ్రామానికి చెందిన రైతులు నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ నరసింహమూర్తి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ఆర్సెలార్ మిట్టల్ నిప్పున్ స్టీల్ ప్లాంట్ కు 2020 ఎకరాలు సేకరించారు పైగా ఇప్పుడు మరలా ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్ కొరకు 440 ఎకరాలు నెల్లి పూడి రెవెన్యూ లో సేకరించడానికి పూనుకోవడం రైతులకు అన్యాయం చేయడమే అవుతుందని తెలిపారు, అభివృద్ధి పరిశ్రమలు పేరు చెప్పి వందల ఎకరాలు కార్పోరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడమే పనిగా కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకున్నారు, వెంటనే ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియ నిలుపుదల చేయాలని కోరారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులు యొక్క అంగీకారం లేకుండా రైతులు భూములలో కలెక్టర్ కూడా అడుగు పెట్టకూడదని తెలుపుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు వెంటనే ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

రోలుగుంటలో 500 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-రోలుగుంట: రోలుగుంట మండలం కె.నాయుడుపాలెంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంపై అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద రైస్ బస్తాలు తరలింపులో ఉన్నాయన్న సమాచారం అందడంతో తహసిల్దార్ నాగమ్మ వెంటనే అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మొత్తం 500 కిలోల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసిన బియ్యాన్ని రైస్ గోదాంలో జమ చేశామని తహసిల్దార్ చెప్పారు. అలాగే రైస్ తరలింపుకు బాధ్యుడైన వ్యక్తిని పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. దాడుల్లో ఆర్ఐ రామమూర్తి సహా రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి

- మెడకు ఉరి వేసుకొని నిరసన

- సిపిఐ, రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-అనకాపల్లి: ధాన్యం, పత్తి మొక్కజొన్న, అరటి, తదితర పంటల కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని,భూమిలేని కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. జిల్లా కేంద్రంలో గల సిపిఐ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా నెహ్రూ చౌకు లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ, రైతుల మెడకు ఉరి వెయ్యద్దు అన్నట్లుగా మెడకు ఉరేసుకుని నిరసన తెలిపారు. అనంతరము ఆర్డీవో కార్యాలయం చేరుకొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ నిబంధనలు సడలించి ధాన్యం,మొక్కజొన్న,పత్తి పంటలనుమద్దతు ధరలకు అదనంగా రాష్ట్రప్రభుత్వం బోనస్ కలిపి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని కౌలురైతులందరికి అన్నదాత సుఖీభవ పథకంతో పాటు బ్యాంకు రుణాలు,వ్యవసాయ, ఉద్యాన తదితర అన్నిరకాల పథకాలు అమలు చేయాలని,మార్కెట్ లో ధరలు పడిపోయి నష్ట పోతున్న అరటి,నిమ్మ,బత్తాయి రైతులను ఆదుకోవాలని,మొంథా తుపాను, అధిక వర్షాలు,వరదలు , కరువు వలన పంటలు దెబ్బతిని నష్టపోయినరైతులకు,కౌలురైతులకు వెంటనే ఇన్ పుట్ సబ్సిడీని చెల్లించాలని డిమాండ్ చేశారు. రబీ పంట కాలంలో సాగు చేసిన పంటలన్నిటికి ఉచిత పంటల బీమా పథకం అమలు చెయ్యాలని, కేంద్ర ప్రభుత్వం ఒక పర్యాయము వ్యవసాయ రుణాలు అన్నిటిని మాఫీ చేసి రైతులను,కౌలురైతులను ఆదుకోవాలని,వ్యవసాయ అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు,కౌలు రైతు కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. స్వదేశీ రైతాంగానికి నష్టం చేసే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై గతంలో ఉన్న సుంకాలను పునరుద్ధరించాలి. దేశం నుండి ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయించాలని, రైతు వ్యతిరేక విద్యుత్ బిల్లు,సీడ్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, రొయ్యలు,చేపలకు కూడా మద్దతు ధరల ప్రకటించి ఆక్వా రైతుల నష్టపోకుండా చర్యలు చేపట్టాలి. సీడ్ కు, ఫీడ్ కు, విద్యుత్తుకు సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేశ్వరి,ఫణీంద్ర కుమార్,రైతు సంఘం నాయకులు కోరుబిల్లి శంకర్ రావు, సిపిఐ వివిధ మండల కార్యదర్శులు దేవుడుబాబు,రాజు,కన్నబాబు, త్రినాథ్, పోతురాజు,సత్యనారాయణ ,శరగడం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ..

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి!

సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-నర్సీపట్నం: రైతుల పండించిన పట్ల గిట్టుబాటు ధర కల్పిం చాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని సిపిఐ పార్టీ, రైతు సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మరియు రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఇరువురూ మాట్లాడుతూ నిబంధనలు సడలించి ధాన్యం మద్దతు ధరలకు అదనంగా రాష్ట్రప్రభుత్వం బోనస్ కలిపి కొనుగోలు చేయాలి. భూమి లేని కౌలురైతులందరికి అన్నదాత సుఖీభవ పథకంతోపాటు బ్యాంకు రుణాలు, వ్యవసాయ, ఉద్యానవన తదితర అన్నిరకాల పథకాలు అమలు చేయాలి.మార్కెట్ లో ధరలు పడిపోయి నష్ట పోతున్న అరటి,నిమ్మ,బత్తాయి రైతులను ఆదుకోవాలి.మొంథా తుపాను, అధిక వర్షాలు,వరదలు మరియు కరువు వలన పంటలు దెబ్బతిని నష్టపోయినరైతులకు,కౌలురైతులకు వెంటనే ఇన్ పుట్ సబ్సిడీని చెల్లించాలి. రబీ పంట కాలంలో సాగు చేసిన పంటలన్నిటికి ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఒక పర్యాయము వ్యవసాయ రుణాలు అన్నిటిని మాఫీ చేసి రైతులను,కౌలురైతులను ఆదుకోవాలి.వ్యవసాయ అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు,కౌలు రైతు కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి.స్వదేశీ రైతాంగానికి నష్టం చేసే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై గతంలో ఉన్న సుంకాలను పునరుద్ధరించాలి. దేశం నుండి ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయించాలి. రైతు వ్యతిరేక విద్యుత్ బిల్లు సిడి బిల్లును వెంటనే ఉపసరించుకోవాలి. రైతు ప్రయోజనాలకు కాపాడే విధంగా బిల్లులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు గంగా భవాని,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావు జగ్గారావు, గొల్లు గురుబాబు, గుడాల రాధాక్రిష్ణ, డొక్కా క్రాంతి, జిల్లా సమితి సభ్యులు శివలంక కొండలరావు, వెలుగుల అర్జున రావు,రైతు సంఘం నాయకులు మర్రి బాబులు,మేకా సత్యనారాయణ, శ్రీరామ మూర్తి ,చిన్నయ్య నాయుడు, నాగేశ్వరరావు,పాదాలు, లక్ష్మి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని ప్రైవేటీకరణనే

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

విశాలాంధ్ర -యస్.రాయవరం : కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ రంగాల్లో పనిచేసేవి అన్ని ప్రైవేటీకరణ చేయడమే తమ లక్ష్యంగా పనిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ కంబాల జోగులు విమర్శించారు .మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట నియోజకవర్గం లో సేకరించిన సంతకాల కరపత్రాలను జిల్లా కేంద్రం అనకాపల్లికి తరలించడం జరిగింది. అందులో భాగంగా అడ్డు రోడ్డులో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ...పేద ప్రజలకు వైద్య విద్య ఆరోగ్యం అందించాలనే ముఖ్య ఉద్దేశంతో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని వాటిని ఈ ప్రభుత్వము ప్రైవేటీకరణకు చేయడం దారుణమని అన్నారు. ప్రజల్లోకి ఈ విషయం వెళ్లడంతో నియోజవర్గంలో సంతకాల సేకరణలో అపూర్వ స్పందన వచ్చిందని సుమారు 60 వేల మంది సంతకాలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సంతకాల కరపత్రాలను తనతోపాటు నియోజకవర్గంలో ముఖ్య నాయకులు కలిసి అనకాపల్లి లో జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ కు అప్పగించడం కోసం వెళ్లడం జరిగింది .ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు మాతా గురునాథ్, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైసిపి మండల అధ్యక్షులు మధు వర్మ, సీరం నరసింహమూర్తి, నియోజకవర్గ వైసిపి యువజన అధ్యక్షుడు పోచిన నరేష్, వైసిపి సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబురావు ,పొడగట్ల పాపారావు, దుబాసి సాయి, గొర్ల బాబురావు, శ్రీపతి రాజు ,వీసం రాజు ,వియ్యపు వరహాలు ,చొప్ప రాజు, మైలపల్లి రాజారావు ,ఎన్ .వెంకట్రాజు, నాగనబోయిన శ్రీను, సర్పంచులు కర్రీ సత్యనారాయణ ,మైలపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

11వ విడత మొబైల్ రికవరీ మేళాలో రూ.1.50 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ

ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లా పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా పని చేస్తుందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో 11వ విడత "మొబైల్ రికవరీ మేళా" ను నిర్వహించారు. గత 2-3 నెలల కాలంలో రికవరీ చేసిన 750 మొబైల్ ఫోన్లను (విలువ సుమారు రూ. 1.50 కోట్లు) సంబంధిత బాధితులకు ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.జిల్లాలో ఐటీ కోర్ టీమ్ చేస్తున్న నిరంతర కృషిని కొనియాడారు. ఈ 11వ విడతలో 750 మొబైల్ ఫోన్లు (యాపిల్, శాంసంగ్, వివో, రెడ్ మి మొదలైనవి) రికవరీ చేసినట్లు తెలిపారు. 2022 జూన్ 1 నుంచి ఇప్పటివరకు 11 విడతల్లో కలిపి మొత్తం 4,086 మొబైల్ ఫోన్లను రికవరీ జరిగిందని తెలిపారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 6.77 కోట్లు అని అన్నారు. కేవలం ఈ సంవత్సరంలోనే ఇప్పటివరకు జరిగిన 3 మేళాల ద్వారా 1,880 మొబైల్ ఫోన్లను (విలువ రూ. 3.70 కోట్లు) రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. కేవలం మన జిల్లాలోనే కాకుండా, పొరుగు జిల్లాలైన తూర్పు గోదావరి, అనంతపురం, సత్యసాయి జిల్లాలతో పాటు.. ఇతర రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, తెలంగాణ ప్రాంతాల నుండి కూడా మన ఐటీ కోర్ బృందం వ్యయప్రయాసలకు ఓర్చి ఈ ఫోన్లను రికవరీ చేసిందని తెలిపారు. నిరంతరం శ్రమిస్తూ, సాంకేతికతను జోడించి బాధితులకు న్యాయం చేస్తున్న సైబర్ సెల్ సిఐ బెండి వెంకటరావు, ఐటీ కోర్ ఎస్సై సురేష్ బాబు , సిబ్బందిని, ప్రత్యేక సెల్ బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. హెచ్.సి లక్ష్మీపతి రావు, పీ.సీలు , అనంత కళ్యాణ్, గోవిందరావు, దిలీప్ కుమార్, నరేష్, హోంగార్డులు సింహాచలం, రమేష్ కుమార్ లకు ప్రశంసా పత్రాలు , నగదు రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ బి.వెంకట రావు, ఇతర ఇన్స్పెక్టర్లు బాలసూర్యా రావు, లక్ష్మీ, రమేష్, ఐటీ కోర్ ఎస్సై బి.సురేష్ బాబు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మండలసర్వసభ్య సమావేశంలో వాడి వేడిగా చర్చ

విశాలాంధ్ర-కోటవురట్ల: బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై వాడి వేడిగా చర్చ జరిగింది. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం వలన పలు గ్రామాల్లో మంచినీటి సమస్య జటిలమవుతుందని బికెపల్లి సర్పంచ్ మండల తెదేపా అధ్యక్షులు పెట్ల లింగన్న నాయుడు సభలో ప్రశ్నించారు. ఇప్పటివరకు మండలంలో ఏఏ గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు పూర్తయ్యాయో వివరాలు తెలియజేయాలని కోరారు.పెండింగ్ పనులను పూర్తి చేసి సకాలంలో మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని కోరారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా రాయితీపై అందిస్తున్న సోలార్ విద్యుత్తిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ పరమేశ్వరరావు సభలో తెలియజేశారు. ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, సోషల్ వెల్ఫేర్, రెవిన్యూ, అంగన్వాడి, పంచాయతీరాజ్, వెలుగు తదితర శాఖల పురోగతిపై సమావేశంలో చర్చించారు. స్థానిక సీతారాం నగర్ కాలనీ వాసులకు సంబంధించిన ఎండోమెంట్ భూ సమస్యను త్వరితగతిన పరిష్కరించి కాలనీవాసులకు న్యాయం చేయాలని ఎంపీటీసీ పీవీ సూర్యరావు తహసిల్దార్ తిరుమల బాబు దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య పరిష్కారానికి మండల సమన్వయ కమిటీలో చర్చించి సంబంధిత ఎండోమెంట్ శాఖ అధికారుల ఇచ్చిన ఆధారాలతో సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, జడ్పిటిసి ఉమాదేవి, వైస్ ఎంపీపీ దత్తుడు సీతబాబురాజు, పిఎసిఎస్ అధ్యక్షులు జనార్దన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్

పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల పరిష్కారానికి అవకాశం : ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర-అనకాపల్లి: ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో, వాహనదారులు తమ వాహనాలపై ఉన్న పెండింగ్ ట్రాఫిక్ ఈ-చలాన్లను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి ఒక ప్రత్యేక వెసులుబాటు కల్పించబడుతుందని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను ఈ లోక్ అదాలత్‌లో సులభంగా పరిష్కరించుకోవచ్చు అని అన్నారు. ఇది చలాన్లు క్లియర్ చేసుకోవడానికి ప్రజలకు ఒక మంచి అవకాశమన్నారు. దీనివల్ల భవిష్యత్తులో కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ , సమయం ఆదా అవుతుందని జిల్లాలోని వాహనదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, డిసెంబర్ 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా కోర్టులోని న్యాయ సేవా సదన్ ను సంప్రదించాలని సూచించారు.

బెల్ట్ షాపులు రద్దు చేయాలి ఏపీ కల్లు గీత కార్మిక సంఘం

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలో ఉన్న మద్యం బెల్ట్ షాపులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. బత్తిన నాగేశ్వరావు మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వం వేలం పాటల ద్వారా నిర్వహించిన వైన్ షాపుల నుండి మద్యం కొనుగోలు చేసి గ్రామాలలో కిల్లి బడ్డీలలో అధిక రేట్లకు అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కిల్లి బడ్డీ బెల్ట్ షాపు లాగా మారిందని, దీని కారణంగా కల్లుగీత కార్మికులు అమ్ముకుంటున్న కల్లు అమ్ముడుపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాలలో బెల్ట్ షాపులు తొలగించాలని పలు పర్యాయాలు మండల, జిల్లా స్థాయి అధికారులకు విన్నవించుకున్న ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బెల్ట్ షాపులు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, కల్లుగీత కార్మికులను ఆదుకోవాలని నాగేశ్వరరావు కోరారు.

వడ్డాది సెక్షన్ విద్యుత్ ఏఈ గా బాధ్యతలు స్వీకరించిన వెంకట్రావు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలోని వడ్డాది సెక్షన్ విద్యుత్ ఏఈ గా వంుు విుృన వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు గతంలో పాడేరు సెక్షన్ ఏఈగా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన ఏఈ సోమయాజులు పాడేరు సెక్షన్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏఈ వెంకటరావు మాట్లాడుతూ మండలంలోని వివిధ రకాల సమస్యల విద్యుత్ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

విశాలాంధ్ర-మాకవరపాలెం : గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరి నిందితులకు మూడు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం 1వ అదనపు జిల్లా %ం% సెషన్స్ కోర్టు తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మాకవరపాలెం ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదు చేసిన గంజాయి అక్రమ రవాణా కేసులో తమిళనాడు రాష్ట్రంనకు చెందిన గోవిందరాజ్ సెల్వరాజ్, రాజమణిలకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి ?.5,000 జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించనట్లయితే అదనంగా 2 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం 1వ అదనపు జిల్లా %ం% సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటనారాయణ ఈ రోజు తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాకవరపాలెం పోలీసులను అభినందించారు.

గ్రామాల్లోనూ తపాలా సేవలు

అనకాపల్లి తపాలా ఎస్పీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-మాకవరపాలెం : గ్రామ స్థాయిలోని అన్ని బ్రాంచి పోస్టాఫీసుల్లో తపాలా శాఖ సేవలను అందుబాటులో ఉంటాయని అనకాపల్లి పోస్టల్ సూపరిండెంట్ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మాకవరపాలెం పోస్ట్ ఆఫీస్ లో బుధవారం తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలో అనేక డిజిటల్ విధానంలో అనేక పథకాలు, భీమా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల లబ్ధి ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ లో సులువుగా జమ అవుతాయన్నారు. ఈ నెల 18,19,20 తేదీలలో బీమా సంకల్ప్ నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భీమా, ఆర్.పి.ఎల్.ఐ, పిఎల్ఐ, మెగా మేళ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ ను సంప్రదించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్పెక్టర్ బి.దివాకర్ మూర్తి, సబ్ పోస్ట్ మాస్టర్ సిహెచ్.రాము పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ మీట్ లో సత్తా చాటిన మండల దివ్యాంగ విద్యార్థులు

12 మంది కి గోల్డ్ మెడల్స్, ముగ్గురికి బ్రాంజ్ మెడల్

విశాలాంధ్ర-రావికమతం: అనకాపల్లి ఏ ఎం ఏ ఎల్ కాలేజీలో జరిగిన దివ్యాంగ విద్యార్థుల జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ మీట్లో రావికమతం మండలం దివ్యాంగ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి వివిధ క్రీడా విభాగాల్లో బంగారు, వెండి, రజత పతకాలను సాధించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు జిల్లా సమగ్ర శిక్ష అదనపు పథక సంచా లకులు పి. అప్పారావు,సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి. రామ కృష్ణ నాయుడు చేతుల మీదుగా సర్టిఫి కెట్స్ మరియు మెడల్స్ ను అందుకున్నా రు. మండలం లో మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి. బాబురావు శారీరక వైకల్యం బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో మరియు షాట్పుట్ క్రీడా పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాలను, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల కు చెందిన నలుగురు దివ్యాంగ బాలికలు రాజాన మానస, సుంకర దివ్య మణికంఠ, చైతన్య, హేమదుర్గ వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు మరియు వెండి పతకాలను, కొత్తకోట జూనియర్ కళాశాలకు చెందిన కొట్యాడ రాము, జలుమూరు ధనలక్ష్మి, మల్లేటి ఆనంద్, వేపాడ దుర్గ వివిధ విభాగాల్లో బంగారు పతకాలను, ఏపీ మోడల్ స్కూల్ చెందిన శారీరిక దివ్యాంగ వీల్ చైర్ కి సంబంధించి క్రీడా పోటీల్లో పాల్గొని గెలుపొంది బంగా రం మరియు వెండి పతకాలను సాధించా రు.జిల్లాలో పారాస్పోర్ట్స్ మీట్లో రావికమ తం మండలం నుండి అత్యధిక పతకా లను సాధించిన దివ్యాంగ విద్యార్థులను, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, సరోజినిలను మండల విద్యాశాఖ అధికారులు మరియు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు....

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జడ్జి, జూనియర్ డివిజన్ యలమంచిలి వారి కోర్టులో
ఒ.యస్.నెం.238(2024)

మధ్యన
రెడ్డి బాలబ్రుందశ్రీ మరియు ఒకరు
మైనర్లు రిప్రసెంటెడ్ బై రెడ్డి (లాలం) నాగమణి ....వాదులు
మరియు
రెడ్డి నాయుడు మరియు ఇతరులు
...ప్రతివాదులు

టు
రెడ్డి హరి, తండ్రి నాయుడు, నునపర్తి గ్రామం, అచ్యుతాపురం మండలం, అనకాపల్లి జిల్లా.

ప్రచురణ

పై నెంబరు దావాలో ప్రతివాది. నెం.3 కు పలుపర్యాయములు కోర్టుద్వారా సమన్లు పంపించి ననూ సదరు ప్రతివాది. నెం.3 కు పర్సనల్ గా సర్వ్కావటం లేదు. సదరు కారణంగా పై కోర్టువారు తేది. **16.10.2025**ని పేపర్ పబ్లికేషన్ ద్వారా పై ప్రతివాది. నెం.3 కు జనరల్ నోటీసు నకు ఆర్డరువేసియున్నారు. సదరు ప్రతివాది. నెం.3కు పేపర్పబ్లికేషన్ మూలంగా సమన్లు సర్వ్ చేయడంలో పై ప్రతివాది.నెం.3 కు ఏమైనా ఆక్షేపణలున్నచో పైకోర్టువారి ఎదుట తేది.**15.12.2025**దిన ఉదయం 10.30 గంటలకు హాజరై తమయొక్క ఆక్షేపణలు తమరుగాని, తమ వకీలు ద్వారాగాని తెలియచేయవ లేనియెడల మీకు పరోక్షముగా తీర్మానం చేయబడును.

ఇట్లు
యస్.వి.ఎ.ప్రసాదు, అద్వకేటు,
రామ్‌నగర్ యలమంచిలి మున్సిపాలిటీ,
సెల్: 7893802452

విశాలాంధ్ర ▸ అనకాపల్లి
పేజి :2
గురువారం, 11, డిసెంబర్ 2025

హౌసింగ్, సర్వశిక్ష అభియాన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర-వి.మాడుగుల: మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం మాడుగుల పి4 కార్యాలయంలో హౌసింగ్, సర్వశిక్ష అభియాన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ పిఎం 2.0 యాప్‌లో రిజిస్ట్రేషన్లు, ఇతర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, సర్వ శిక్ష అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-మాకవరపాలెం : రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. బుధవారం తహసీల్దార్ అధ్యక్షతన ఖరీఫ్ 2025 సీజన్ ధాన్యం సేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్మకాలపై ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు వివరించారు. ఈ ఏడాది ధాన్యం సాధారణ రకం రూ.2369, గ్రేడ్ %ూ% రకం రూ.2389 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.అప్పారావు, ఎఫ్.పీ.ఓ సిఈవో ఆడారి సూరిబాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి - ఎస్సై పురుషోత్తం

విశాలాంధ్ర-పాయకరావుపేట. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చట్టాలు, కేసులు, శిక్షలు పై అవగాహన ఉండాలని ఎస్సై పురుషోత్తం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్, ర్యాగింగ్, న్యూ క్రిమినల్ లాస్ గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

విశాలాంధ్ర-కోటవురట్ల: హౌసింగ్ ఏఈ వరప్రసాద్: , పి ఎం ఏ వై, ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామని గృహ నిర్మాణ శాఖ అధికారి వరప్రసాద్ అన్నారు. గృహ లబ్ధిదారుల వివరాల కొరకు కైలాసపట్నం గ్రామంలో బుధవారం పర్యటించారు. పీఎంఏవై, ఎన్టీఆర్ గృహ నిర్మాణ కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు.ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎటువంటి గృహం మంజూరు కానీ వారికి అర్హతను బట్టి గృహాలు మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్, గ్రామ తెదేపా అధ్యక్షులు భీముని మాణిక్యాలరావు, గుంపిన చిన అప్పారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలోని పెనుగొల్లు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై ఏ.విభూషణ్ రావు తెలిపారు .బుధవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతున్న సమయంలో లారీ ఢీకొట్టడంతో లింగరాజుపాలెం గ్రామానికి చెందిన ఏడిద దిలీప్ కుమార్ మృతి చెందాడని అన్నారు. అలాగే మరో ఇద్దరు యువకులు ఎన్ .జగన్, జితేంద్ర లకు తీవ్ర గాయాలు అవడంతో నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ప్రథమ చికిత్స అనంతరము మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్ కు తరలించినట్లు వెల్లడించారు .దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జి.ఎస్టీ. 2.0 పై అవగాహన ....

గ్రామ సేవలో భాగస్వామ్యమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం ...

విశాలాంధ్ర-చోడవరం :జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) గ్రామ సేవా కార్యక్రమాలు, స్పెషల్ క్యాంప్ భాగంగా 6వ రోజైన బుధవారం అంకుపాలెం లో జీఎస్టీ 2.0 పై అవగాహన కల్పించారు. విద్యార్థులను సమాజానికి, దేశానికి సేవచేయడం ద్వారా వ్యక్తిత్వ వికాస అభివృద్ధి జరుగుతుందని చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ -2 అధికారి బి. విచ్చమ్మ తెలియజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి వి.అప్పల నాయుడు మాట్లాడుతు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు ద్వారా గ్రామలకు ఉచిత సేవలు అందిసస్తున్నట్టు తెలిపారు. అంటు వ్యాధులు పై విద్యార్థులకు గ్రామ ప్రజలకు ఏ.ఎన్.ఎమ్ అప్పలనరసమ్మ అవగాహన కల్పించారు. అనంతరం రత్న భారతి ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్స్ పై వాలంటీర్ లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, అధ్యాపకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట యాదవ సంఘం అధ్యక్షుడిగా రెండోసారి సింగంపల్లి రమేష్ యాదవ్..

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు భరిణికాన బాబురావు, ప్రధాన కార్యదర్శి సబ్బి శ్రీను, గౌరవాధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు అధ్యక్షతన మండలంలోని బుచ్చయ్యపేట వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన చోడవరం నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశంలో మండల యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి వడ్డాది గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండల తెలుగు యువత అధ్యక్షులు సింగంపల్లి రమేష్ ను, ప్రధాన కార్యదర్శిగా నేతవాణి పాలెం గ్రామానికి చెందిన వియ్యపు రామారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రమేష్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని అత్యధిక సామాజిక వర్గం కలిగిన యాదవులకు మరింత సేవ చేసే భాగ్యం కల్పించిన జిల్లా సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో యాదవ సంఘం ముఖ్య నేతలు హాజరయ్యారు.

పంట వ్యర్థాలను కాల్చరాదు

విశాలాంధ్ర-మాకవరపాలెం : పంట సీజన్ ముగిసిన తర్వాత మిగిలిన వ్యర్థాలను పొలంలో కాల్చకుండా రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి డి.అప్పారావు సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని తూటిపాల, బూరుగుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పాల్గొని పలు సూచలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ నేల సారాన్ని కాపాడాలంటే రైతులందరూ విధిగా పంట వ్యర్థాలను భూమిలో కలిగి దున్నలన్నారు. పంట వ్యర్థాలు భూమికి సహజ పోషకాలు అందిస్తాయని అవి కాల్చడం వలన నష్టం వాటిల్లుతుందని , వాటిని కలియదున్నడం వల్ల లాభం ఉంటుందని తెలిపారు. పంట అవశేషాలు కాల్చడం వలన నేలలో కార్బన్ శాతం తగ్గిపోతుందని, దూళి, పొగ వల్ల శ్వాస సమస్యలు ఏర్పడతాయన్నారు. నేల ఉపరితలం నుంచి ఒక సెంటీమీటర్ లోపలి వరకు ఉష్ణోగ్రత 8 డిగ్రీలు పెరిగి నేలలో పంటకు మేలు చేసే బ్యాక్టీరియా మరియు ఫంగస్ నాశనం అవుతాయని, తద్వారా తర్వాత పంటకు నష్టం వాటిల్లుతుందని వివరించారు.

అరట్లకోటలో ముగిసిన స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రత్యేక సేవా శిబిరం

విశాలాంధ్ర-పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్-1 అరట్లకోటలో నిర్వహిస్తున్న సేవా శిబిరం బుధవారంతో ముగిసింది. ఈనెల 4 నుండి 10వ తేదీ వరకు జరిగిన వివిధ కార్యక్రమాలలో భాగంగా ప్రజలకు వివిధ వ్యాధులపై అవగాహన, కంటి వైద్య శిబిరం, దంత వైద్య శిబిరం, స్వచ్ఛభారత్ ర్యాలీలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండే అవగాహన కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో మండల తహసీల్దార్ మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొని సేవాభావం అలవరచుకోవడానికి ఇటువంటి ప్రత్యేక సేవా శిబిరాలు దోహదపడతాయని తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఎక్కడైతే ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా ఉంటుందో అక్కడే అభివృద్ధి సాధ్యమవుతుందని, మానవ హక్కులు పరిరక్షించే బాధ్యత యువతపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. రామకృష్ణారెడ్డి, శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భానుమూర్తి, గ్రామ సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. భాస్కరరావు, కట్టా శ్రీను, తుమ్మల గణేష్, వేముల వెంకటేశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నక్కపల్లి డివిజన్ వద్దు...మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్ లోనే కొనసాగించండి

మండల వైసీపీ అధ్యక్షులు ఆదారి గణపతి అచ్చియ్యనాయుడు

విశాలాంధ్ర-మునగపాక:నక్కపల్లి డివిజన్ వద్దు...మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్ లోనే కొనసాగించాలని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆదారి గణపతి అచ్చియ్యనాయుడు పేర్కొన్నారు.స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమీపంలో వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం మల్లవరం, నాగవరం,గొల్లలపాలెం,వాడ్రాపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు,కార్యకర్తలు 3వ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కన డివిజన్ను కాదని 60కిలో మీటర్ల దూరంలో ఉన్న నక్కపల్లిలో విలీనం చేయడం భావ్యం కాదన్నారు.మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్ లోనే కొనసాగించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కాండ్రేగుల నూకరాజు,మండల వైసీపీ మహిళా అధ్యక్షురాలు చీర రమణమ్మ,మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు,మాజీ జడ్పీటీసీ మళ్ల సంజీవరావు,ఎంపీటీసీ నూరిశెట్టి రాము,వార్డు సభ్యులు పెంటకోట సత్యనారాయణ,వైసీపీ నాయకులు ఆదారి కాశీబాబు,ఆదారి రాంబాబు,మళ్ల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

12న అంగన్వాడీ సమస్యలపై ధర్నా..

విశాలాంధ్ర-చోడవరం: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాల అమలు, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 12వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ఆందోళన జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్నా కరపత్రాన్ని బుధవారం అంబేద్కర్ భవన్ లో విడుదల చేశారు. అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తూ వేతనాలు పెంచడం లేదని అందుకే ఈ నెల 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లు వద్ద ఆందోళన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు కె.కొండమ్మ, కె.మహాలక్ష్మి, రంగ లక్ష్మి, రాయవరపు వరలక్ష్మి, సీరం రమణమ్మ ఎస్.అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య పేదలకు అందని ద్రాక్షగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజల ఆవేదన, ఆందోళనలే కోటి సంతకాలుగా మారాయి - మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర-చోడవరం : వైద్యవిద్యను పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారుస్తున్న కూటమి ప్రభుత్వంపై ఆవేదన ఆందోళనలే కోటి సంతకాలుగా మారాయని మాజీ మంత్రి చోడవరం వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి గుడివాడ అమర్నాథ్ అన్నారు. కోటి సంతకాల ప్రతులను జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించేందుకు బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ వైసిపి జాతీయ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చోడవరం నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం అపూర్వ విజయాన్ని సాధించింది అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన కోటి సంతకాల సేకరణ ...., ప్రజల కోపం, ఆవేదన, ఆత్మగౌరవం కలిసిన మహా ఉద్యమం అన్నారు. యువత, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, మేధావులు అందరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. ప్రజలే స్వచ్ఛందంగా సంతకాల బాట పట్టారని, ప్రతి సంతకం ఒక గళమని, ఓ హెచ్చరిక గా ప్రజా సంకల్పమని తెలియజేశారు. 17 మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందన్న ఆవేదన ప్రజల్లో తీవ్రంగా నెలకొందని, ఆ ఆవేదనను అర్థం చేసుకొని ఉద్యమాన్ని ప్రజల్లోకి వైఎస్ఆర్సిపి తీసుకు వెళ్ళడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పంపిన కోటి సంతకాలు. భవిష్యత్తులో పేదల విద్య హక్కును కాపాడిన చెరగని సంతకాలుగా గుర్తుండిపోతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నుండి పార్టీ అధ్యక్షులు ఎంపీపీలు, జడ్పిటిసిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం

- ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత - ఎంపీటీసీ కలిదిండి సతీష్ రాజు
- పంటల నష్టపరిహారం జాబితాలో అనర్హులకు చోటు - ఎంపీటీసీ కొంతం నరేష్
- కోతులు, కుక్కలు అరికట్టండి - సర్పంచ్ గారా కృష్ణప్రసాద్
- రొయ్యల చెరువులపై చర్యలు తీసుకోవాలి - సర్పంచ్ వంకా వెంకట

విశాలాంధ్ర-పాయకరావుపేట: అధికారుల తీరుపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాయకరావుపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు పలు శాఖల అధికారులను ప్రశ్నలతో నిలదీసి, ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత ఉంటే వైద్యులు ఏం చేస్తున్నారని గోపాలపట్నం ఎంపీటీసీ కలిదిండి సతీష్ రాజు వైద్యులను నిలదీశారు. ప్రజా ప్రతినిధులు అంటే అధికారులకు లెక్క లేదని, ఆసుపత్రిలో సమావేశాలు ఏర్పాటు చేయక ఎన్నాళ్ళయిందని, ఆసుపత్రులకు వచ్చే నిధులతో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల సంభవించిన తుఫాను కారణంగా పంటలకు నష్టం జరిగితే గ్రామాలలో అధికారులు సర్వే చేసి నష్టపరిహారం అందించే రైతుల జాబితాను తయారు చేశారని, అయితే అందులో అనర్హులు ఎక్కువమంది ఉన్నారని వ్యవసాయ శాఖ అధికారిని మాసాహెబ్ పేట ఎంపీటీసీ కొంతం నరేష్ (దివాణం) ప్రశ్నించారు. గ్రామాల్లో కుక్కలు, కోతులు బెడద ఎక్కువగా ఉందని వీటిని అరికట్టేందుకు మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణ ప్రసాద్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కుక్కల కారణంగా ప్రజలు వీధుల్లో తిరగలేకపోతున్నారని, కోతుల కారణంగా రైతులు వంటలు నష్టపోతున్నారని తెలిపారు. కుక్కలు, కోతులను పట్టుకొని ఇతర ప్రాంతాల్లో వదిలేందుకు మండల పరిషత్ నుంచి పంచాయతీలకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగస్తుల పనితీరులపై అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో, ఏ పనులు చేస్తున్నారో మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని కోరారు. రొయ్యల చెరువులు ఏర్పాటు పై వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ అధికారులను ప్రశ్నించారు. రొయ్యల చెరువులు ఏర్పాటు కోసం పంచాయితీల అనుమతులు తీసుకోవడం లేదని, అటువంటి చెరువులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రొయ్యల చెరువులు కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలలో గత ప్రభుత్వంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నేటికీ ఎందుకు ప్రారంభించలేదని శ్రీరాంపురం పిఎసిఎస్ అధ్యక్షులు చిక్కాల శ్రీనివాసరావు పంచాయతీరాజ్ ఏఈ కచేరిని ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ప్రారంభోత్సవం చేయలేదని ఈదటం ఎంపీటీసీ పద్మావతి అధికారులను ప్రశ్నించారు. మండలంలోని పలు గ్రామాలలో కిల్లి బడ్డీలన్నీ బెల్ట్ షాపుల్లాగా మారిపోయాయని, వీటిని అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పోలీసులు దాడులు నిర్వహించిన, కేసులు నమోదు చేసిన, సాయంత్రానికి ఇంటికి చేరుకుని మరలా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని తెలిపారు. బెల్ట్ షాపులు నియంత్రించడంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు సహకరించాలని అధికారులు చెప్పడంతో, సభ్యులంతా ఒక్కసారిగా అధికారులు నిలదీశారు. గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించే వారితో గొడవ పెట్టుకుంటే, అధికారులు ఏం చేస్తారని గోపాలపట్నం ఎంపీటీసీ కలిదిండి సతీష్ రాజు తో పాటు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులను ప్రశ్నించారు. అంతకుముందు గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఎంపీడీవో విజయలక్ష్మి సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లంక సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, తహసిల్దార్ మహేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి చేరుకున్న కోటి సంతకాల పుస్తకాలు

విశాలాంధ్ర-అనకాపల్లి: పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకొని ఆ కాలేజీలు ప్రభుత్వ రంగంలోనే నడిచే విధంగా ప్రజల అభిప్రాయాలను సంతకాల రూపంలో తీసుకొని కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైసిపి చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సంతకాల సేకరణ ముగిసిన నేపద్యంలో నియోజకవర్గాల నుంచి జిల్లా కార్యాలయానికి ఆ కోటి సంతకాల పుస్తకాలను ఊరేగింపుగా ఉత్సాహంగా పార్టీ శ్రేణులు తీసుకువస్తున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రానికి చేరుకున్న కోటి సంతకాల పుస్తకాలను భారీ ర్యాలీతో జిల్లా కేంద్రంలో ఊరేగించడానికి ఈనెల 15న పదివేల మందితో భారీ ర్యాలీకి సిద్ధమయ్యారు. అందులో భాగంగా బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, గొర్లి సూరిబాబు, దంతులు దిలీప్ కుమార్, పెద్దిశెట్టి గోవిందా, జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ, కాండ్రేగుల విష్ణుమూర్తి, దంతులూరి శ్రీధర్ రాజు, మల్ల బుల్లిబాబు, కె.యం. నాయుడు తదితరులు మాట్లాడుతూ. వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారని తెలిపారు. ప్రభుత్వ విధానాలపై ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సంతకాలు చేయడం శుభపరిణామని అన్నారు. ఈనెల 15న జరిగే ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కోతుల బారి నుండి గిరిజన విద్యార్థినిలకు రక్షణ కల్పించాలి

తహసీల్దార్ కు సీపీఎం వినతిపత్రం

విశాలాంధ్ర-రావికమతం: రావికమతం ఎస్సి వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు తహసీల్దార్ అంబేద్కర్ కు బుధవారం వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ వసతి గ్రుహం లో 134 మంది వివిధ గ్రామాలకు విద్యార్థునులు ఉన్నారని వీరిలో మండలంలో చీమలపాడు శివారు పెదగరువు, రాయిపాడు, అజెయపురం, చీమలపాడు,కళ్యాణపులోవ గ్రామాలతో పాటు వి.మాడుగుల మండలంలో ఆదివాసి గిరిజన పిల్లలు కూడా ఇక్కడ వసతి గృహం ఉంటూ చదువు కుంటున్నారన్నారు. ఈనెల 8వ తేదీ రాత్రి సమయంలో జరిగిన ఘటనకు విద్యార్థునులు తీవ్ర భయాందోళన చెందుతున్నారని వినతిపత్రం లో పేర్కొన్నారు.తక్షణమే చర్యలు చేపట్టి విద్యార్థులకు రక్షణ కల్పించాలని గోవిందరావు డిమాండ్ చేసారు....

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు...

ఎర్రం నాయుడు కళాశాల విద్యార్థులు...

విశాలాంధ్ర-రావికమతం : సేంద్రియ ఎరువులు వాడటం వలన రైతులకు ఖర్చు తగ్గి అధిక దిగు బడులు సాధించవచ్చు నని కింజరాపు ఎర్రంనాయుడు కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలో మత్సవానిపా లెం గ్రామంలో బుధవారం రైతులకు పంటలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వనరులు సక్రమంగా వినియోగించు కుంటే వ్యవసాయం లాభ సాటిగా ఉంటుందన్నారు.తక్కువ పెట్టుబడి తో ఏయే పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దివ్యా, గీతిక, రాజ్యలక్ష్మి, ఉషారాణి, లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.....

ఈ నెల 19 న ఏపీ ఎన్జీవోస్ సబ్బవరం తాలూకా యూనిట్ ఎన్నికలు

విశాలాంధ్ర-సబ్బవరం: రాష్ట్ర గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(ఏ.పి.ఎన్.జ.జి.ఓస్) సబ్బవరం తాలూకా యూనిట్ ఎన్నికల డిసెంబర్ 19వ తేదీన జరుగునున్నట్లు ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎన్జీవోస్ అనకాపల్లి జిల్లా అడక్ కమిటీ చైర్మన్ వేల సూర్యనారాయణ ఎన్నికల నోటిఫికేషన్ ను నవంబర్ 18వ తేదీన విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఎలక్షన్ నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికల అధికారిగా నక్కపల్లి తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్ ను నియమించారన్నారు.ఎన్నికల అధికారి ఎలక్షన్ షెడ్యూల్ ను నవంబర్ 20వ తేదీన జారీ చేయడమైనదన్నారు.ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న న సబ్బవరం ఏపీ ఎన్జీవోస్ తాలూకా యూనిట్ సంఘమునకు ఎన్నికలు జరపబడునని తెలిపారు.ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఈనెల 12వ తేదీ న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడునని తెలిపారు. అదే రోజు నామినేషన్లు పరిశీలన ఆమోదించబడిన నామినేషన్లను నిర్ణయించబడునని తెలిపారు. సభ్యత్వం చెల్లించని సభ్యులు నేరుగా ఎన్నికల అధికారి వారికి చెల్లించి నమోదు చేయించుకోవలసినదిగా కోరారు.సబ్బవరం తాలూకా యూనిట్ సబ్బవరం,పరవాడ మండలాలు పరిధిలోగల పనిచేయుచున్న ఉద్యోగులందరూ ఈ ప్రక్రియలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఎన్నికల అధికారి కోరారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 11, డిసెంబర్ 2025

హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర-ఉరవకొండ: విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం వజ్ర కరూరు మండలం రాగులపాడు గ్రామం వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, కొనకొండ్ల గ్రామం వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు 20 రోజుల్లోపు పూర్తి చేసి అప్పగించాలన్నారు. రాగులపాడు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పూర్తయ్యే దశలో ఉందని, కొనకొండ్ల విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం 20 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పేమెంట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, భవనాలను పూర్తి చేసి బిల్ అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్పి శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నరేష్, ఏఈ మణిభూషణ్, ఎంపిడిఓ శివాజీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

కసాపురం ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణ

విశాలాంధ్ర-గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారినిదర్శించుకున్న కలెక్టరు ఓ.ఆనంద్ ని ఆలయ అధికారులు స్వాగతం పలికిన ఆలయ ఈఓ. మేడేపల్లి విజయ రాజు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, వేద పండితులు , అర్చకులు మేళ తాళాలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం శేష వస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు, ఆలయ అభివృద్ధిలోభాగంగా దాతల ద్వారా మరియు ఆలయ నిధులతో జరుగుతున్న వివిధ పనులను ఈవోతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. దేవస్థానం కార్యనిర్వాహనాధికారితో ప్రస్తుతం జరుగుచున్న అభివృద్ధి నిర్మాణపు పనులపై సమీక్ష చేసి కార్యనిర్వా హనాధికారి వినతి పత్రం ఇచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ దేవస్థానమునకు అవసరమగు మంచి నీరు కొరకు హంద్రీ నీవా కాలువ నుండి పైపే లైన్ ఏర్పాటు చేసి దేవస్థానం వద్ద రెండు లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన నిర్మాణం కొరకు సూపరింటెండెంట్ ఇంజనీరు, హెచ్ ఎన్ ఎస్ ఎస్, మరియు ఎస్ ఈ, ఆర్డబ్ల్యూఎస్ కి ఆదేశములు ఇవ్వడము జరిగింది. భక్తుల సోకార్యర్థం 40 టాయిలెట్స్ నిర్మాణం చేయుటకు ప్రాజెక్ట్ డైరెక్టర్, డిడబ్ల్యూఎం ఏకి అంచనాలు తయారు చేయవలసినదిగా ఆదేశించారు. దేవస్థానానికి రెండవ రోడ్డు సబ్ స్టేషన్ ప్రక్కనుండి ఏర్పాటు చేయుటకు ఆర్డీవో, తహసీల్దార్,కి ఆదేశలు జారీ చేశారు. దేవస్థానం ద్వారా భక్తులకు అన్నప్రసాద వితరణ కొరకు నిర్మాణం చేయనున్న భవనం కొరకు అవసరమైన స్థలాన్ని కసాపురం గ్రామస్తులతోచర్చించిలనితహసీల్దార్ ,ఎంపీడీఓ లను ఆదేశించారు. శివాలయం ముందుభాగములో రోడ్డు ప్రక్క స్థలాన్ని పూడ్చటానికి అవసరమైన ఏర్పాట్లు చేయవలసినదిగా ఎంపీడీవో కు చెప్పడం జరిగింది. దేవాలయం వెనుక భాగంలో ఉన్న డ్రైనేజీని మద్దికేర రోడ్డు ద్వారా డైవర్ట్ చేయుటకు పిడి, డి డబ్ల్యు ఎంఏ, ఎంపీడివో లను ఆదేశించారు. గుంతకల్లు ఔటస్కర్ట్ నుండి కొట్టాల నుండి కసాపురం వచ్చు రోడ్డు ను డెవలప్ చేయుటకు విషయం లో అవసరమైన చర్యలు కొరకు తహసీల్దార్ , ఎంపీడివోలను ఆదేశించారు. దేవస్థానం నందు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు డిఇఇ, సోలార్ మరియు డి ఎం, ఎన్.ఆర్ ఇడిసి ఏపీ లను తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో , ఎమ్మార్వో,రెవెన్యూ అధికారులు పోలీసులు,ఆలయ అధికారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణంలో అక్రమాలు

– మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని చెప్పి 80 లక్షల రూపాయలను ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బిల్లులు మంజూరు చేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్యాపిటల్ లిస్ట్ ప్రభుత్వంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అన్యాయులకు సొమ్ము కట్టబెట్టేందుకు అవసరం ఉన్నా లేకున్నా పనులు చేస్తున్న మాటను కోట్లాది రూపాయలు మింగేస్తున్నారన్నారు.పుట్టపర్తిలో సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా నది పరివాహక ప్రాంతానికి ఆనుకుని జోయాలుక్కాస్ సహకారంతో పార్క్ ఏర్పాటు చేసిన ఆ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేసినట్లు మాజీ మంత్రి పల్లె బిల్లులు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు .నిబంధనలకు విరుద్ధంగా ఏ అధికారి వ్యవహరించిన వైసీపీ అధికారంలోకి రాగానే విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. పిపిపి విధానం మాటున రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో అవసరం లేకపోయినా ఔటర్ రింగ్ రోడ్డు మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అస్మదీయులకు కోట్లు చేకూర్చే పనిలో నిమగ్నమయ్యా రన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, కన్వీనర్ రవి నాయక్, ఈశ్వరయ్య, ఎంపీపీ రమణారెడ్డి, జిల్లా మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటల రమణారెడ్డి, కౌన్సిలర్ సాయి గీత,నాయకులు నర్సారెడ్డి పాల్గొన్నారు.

రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి..

విశాలాంధ్ర-విడపనకల్లు : డోనేకల్లు, కడదరబెంచి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ హెచ్.పెన్నయ్య ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను వివరించారు. ముఖ్యంగా పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణ 90 శాతం సబ్సిడీతో డ్రిప్ 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్స్ గురించి రైతులకు వివరిస్తూ, డ్రిప్పు 90 శాతం సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీ కి అయితే 100 శాతం సబ్సిడీతో ఇస్తున్నారని కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ తీసుకోవాలని సూచించారు. ఎంపీఈఓ సోమశేఖర్ రైతులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

విశాలాంధ్ర-గాండ్లపెంట: గర్భవతులు, చిన్నపిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించితే అంటువ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవనం గడపగలరని వైద్య విభాగం అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో టీకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, డిప్యూటీ హెచ్ఈఓ విజయ్‌కుమార్, ఎంఎల్హెచ్‌పీ శిరీష, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు రెడ్డి, భవాని, పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని డిఎంఅండ్‌హెచ్ఓ, ఫైరోజ్ బేగం బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం నమోదవుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సలహాలను సూచనలు అందించారు.

కోటి సంతకాల సేకరణకు స్పందన

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ బుధవారం ఉరవకొండలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో సేకరించిన సంతకాలను ఈనెల 13వ తేదీన అనంత పురంలో ప్రదర్శన చేశామని, 17వ తేదీన పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉరవకొండ ఎంపీపీ నర్సింలు, మాజీ ఎంపీపీ ఏసి ఎర్రిస్వామి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుశీలమ్మ, ఉరవకొండ సర్పంచ్ లలిత, కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఆదినారాయణ అధ్యక్షతన రాజనీతి శాస్త్రం అధ్యాపకులు సిరాజ్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదినారాయణ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సమాజంలో పౌరసత్వము, స్వేచ్ఛ అర్హత, బాధ్యతతో మన హక్కును మనం వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ కే.సుదర్శన్ మాట్లాడుతూ జాతి, లింగం, జాతీయత, మతం వంటి భేదాలు లేకుండా ప్రతి మనిషికి ఉండే ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో లాయర్ నాగిరెడ్డి ఎన్ ఎన్ ఎస్ పిఓడి శివన్న, శ్రీలేఖ, రవికుమార్ ఆర్‌ఆర్‌సి జయప్రకాష్, పాల్గొన్నారు.

ఎన్జీవో యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-పెనుకొండ: ఎపి ఎన్‌జిజిఓ అసోసియేషన్ పెనుకొండ తాలూకా యూనిట్ ఎన్నికల నామినషన్ల ప్రక్రియ సామజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణం లో జరిగినవి. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు పరచగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి దేవేంద్ర స త్యసాయి జిల్లా హడా హాక్ కమిటీ మెంబెర్, సహాయ ఎన్నికల అధికారి సూర్య నారాయణ, ఈశ్వర్ నాయక్, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన పెనుకొండ తాలూకా యూనిట్ అధ్యక్షులు మధుబాబు, కార్యదర్శిగా గంగాధర్ కార్యవర్గ సభ్యులు లకు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, ఆడోహాక్ చైర్మన్ లింగా రామ్మోహన్ , అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు అధ్యక్షలు రవికుమార్, తాలూకా అధ్యక్షులు మధు బాబు సెక్రటరీ గంగాధర్ కు ఎన్నికైన కార్య వర్గ సభ్యులకు జిల్లా కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పంట వ్యర్థాల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర-అగళి : మండలంలోని ఇనగలూరు తొననసనపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగాపంట వ్యర్థాలను పొలంలో కలియదన్నడం వల్ల కలిగే లాభాలు కాల్చడం ద్వారా కలిగే నష్టాల గురించి రైతులకు వ్యవసాయధికారి నాగరాజు అవగాహన కల్పించారు. పంట వ్యర్థాలు భూమికి సహజ పోషకాలు అనివాటిని కాల్చితే నష్టం.భూమిలో కలియ దున్నితే లాభం అని పంట అవశేషాలను కాల్చడం ద్వారా వచ్చే ధూళి, పొగ వల్ల శ్వాస సమస్యలు ఏర్పడతాయన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-నంబులపులకుంట: ఎగువతుపల్లి గ్రామానికి పూర్వం నుండి రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ప్రజా ఫిర్యాదుల వేదికలో గ్రామస్తులు తెలియజేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు ప్రైవేట్ భూములలో 3 కిలోమీటర్ల మేర రోడ్డుకు సంబంధించిన కొలతలు తీసి, భూస్వాముల సమ్మతితో బుధవారం గ్రామపంచాయతీ నిధులతో రోడ్డుపనులను ప్రారంభించారు. సర్పంచ్ చంద్రకళ, తహసీల్దార్ దేవేంద్ర నాయక్, మాజీ సర్పంచులు శ్రీరాములు నాయుడు, నరసింహులు, మాజీ జడ్పీటీసీ పాల్ రెడ్డిపాల్గొన్నారు

ఆగడం లేదు.. అంతేలేదు..

విశాలాంధ్ర - నార్పల : మండల కేంద్రంలో ఇసుక అక్రమ వ్యాపారం ఆగడం లేదు. ట్రాక్టర్ల ద్వారా నిత్యం పెద్ద మొత్తంలో ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ అక్రమ రవాణాకు అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నా, మైనింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక రీచ్‌లో ఉంటున్న సెబ్ అధికారులు వీటిని గమనించకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలించిన ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి

విశాలాంధ్ర-కొత్తచెరువు: బుధవారం ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి కొత్తచేరువు మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మొదట గా కొత్తచేరువు లోని గాంధీనగర్ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి, శుభ్రతను పరిశీలించి "భోజనం చాలా బాగుంది" అని ప్రశంసించారు. మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులను సన్మానించారు. పాఠశాల హెడ్ మాస్టర్ మరియు సిబ్బంది ఆమెను అభినందించారు. తదుపరి, జెడ్‌పీ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మట్లాడారు. మెనూ మేరకు భోజనం అందుతున్నదా, నాణ్యత ఎలా ఉంది అనే విషయాలపై విద్యార్థుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అలాగే కొత్తచేరువు బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యత, పరిమాణం పరిశీలించగా చాలా బాగుంది అని గంజిమల దేవి ప్రశంసించారు. ఈ సందరరేగా ఆమె మాట్లాడుతూ.పిల్లల ఆరోగ్యం, పోషకాహారం మా ప్రాధాన్యత. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయం ఏడి శ్రీనివాసరావు, ఎంఈఓ లో జయచంద్ర, సోమశేఖర్, హెచ్ఎంలు నూర్జహాన్, శివయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు మనసాక్షితో ఓటేయండి ..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: గత మున్సిపల్ ఎన్నికల్లో కళ్యాణదుర్గం పట్టణంలో 24 వార్డులకు గాను 19 మంది కౌన్సిలర్లు వైసీపీ పార్టీ తరఫున ఫ్యాన్ గుర్తుపై గెలిచామని తాజా రాజకీయ సంక్షోభం నేపథ్యంలో మునిసిపల్ చైర్మన్ ఎన్నిక అనివార్యమైన కారణంగా మనస్సాక్షితో వైసిపి కౌన్సిలర్లు ఓటు వేయాలని పట్టణ కన్వీనర్ సుధీర్ కోరారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కొంతమంది వైసిపి కౌన్సిలర్లు టిడిపి లో చేరారని దీన్ని అనుకూలంగా మార్చుకొని తమ పార్టీకి బలం ఉన్నా మున్సిపాలిటీని సంక్షోభంలోకి నెట్టి నూతన చైర్మన్ ను ఎన్నుకోవడానికి ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆయన అనైతిక పద్ధతులను అవలంబిస్తున్నారని ఆరోపించారు. అయితే తమ పార్టీ తరఫున ఫ్యాన్ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు మనసా, వాచా, కర్మణా ఆలోచించి చైర్మన్ అభ్యర్థిగా నిలబడే వ్యక్తికి చేయి ఎత్తి ఓటేయాలని వారు సూచించారు. పార్టీ తరఫున విప్ కూడా జారీ చేశామని దీన్ని అతిక్రమిస్తే చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో తమ కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర టిడిపి కండువా కప్పుకోవడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే అతని గత చరిత్ర ఆలోచించి ఎమ్మెల్యే నిర?యం తీసుకొని ఉంటే బాగుండేదని సలహా ఇచ్చారు. గతంలో పార్టీ మారిన కౌన్సిలర్లు కూడా గురువారం జరిగే చైర్మన్ ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని కోరారు. అనైతిక పద్ధతుల్లో తెలుగుదేశం పార్టీ అధికారాన్ని కైవసం చేసుకోవాలని చూస్తుందని ప్రజలంతా గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దొడగట్ట నారాయణ, హనుమంతరెడ్డి, నరేంద్ర రెడ్డి, భీమేష్, శివ శంకర్ నాయక్ , హనుమంతరాయుడు , బిక్కిహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైద్యానికి నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యాన్ని ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అనుమతి లేదని చాలా ఆసుపత్రుల్లో డబ్బు చెల్లించి వైద్యం చేయించుకుంటున్నారని వాపోయారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదు అని సమాధానం ఇస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో గతంలో 25 లక్షల పరిమితికి ఆరోగ్యశ్రీ పెంచితే ఇప్పటి ప్రభుత్వం కేవలం రూ.5 లక్షల నిధులు కూడా చెల్లించలేదని విమర్శించారు. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిని వైఎస్సార్సీపీ ప్రభుత్వం 20 రూ. కోట్లతో కొత్త భవనాలు వైద్య పరికరాలు బ్లడ్ బ్యాంక్ డయాలసిస్ సెంటర్ కేటాయించి అభివృద్ధి చేస్తే ఈ కూటమి ప్రభుత్వం కనీసం మందులు డాక్టర్లు కూడా కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్ మేధావుల సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి నాయకులు మద్దికెర ప్రతాప్ రఘురామ్ శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-గుంతకల్లు: స్థానిక ఎస్.కే.పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం డిసెంబర్ 10, 2025న మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎ. లక్ష్మయ్య మాట్లాడుతూ, ప్రతి మనిషికి జీవించే హక్కు, సమానత్వం, స్వేచ్ఛ, విద్య, న్యాయం వంటి హక్కులు సహజసిద్ధమైనవని , మానవ హక్కులను గౌరవించడం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని విద్యార్థులకు వివరించారు. రాజకీయ శాస్త్ర విభాగ ఇన్‌చార్జ్ ఎస్. దేవి చైతన్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.రవిశంకర్ శర్మ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలో ఎంపీపీ

విశాలాంధ్ర-విడపనకల్లు : విడపనకల్లు మండల వ్యాప్తంగా గత నెల రోజుల నుండి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంకు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో అనూహ్యస్పందన రావడం జరిగింది. ముగింపుగా నేడు ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీకి వైసీపీ శ్రేణులు వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున పాల్గొని 9250 మంది సంతకాలు చేసిన ప్రతులను నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర్ రెడ్డి, యువనేత వై.ప్రణయ్ రెడ్డికి అందజేశారు. విజయోత్సవ ర్యాలీలో ఎంపీపీ కరణం పుష్పవతి భీమరెడ్డి, మండల కన్వీనర్ కురుబ రమేష్,వైసీపీ సీనియర్ నాయకులు కరణం భీమరెడ్డి, భరత్ రెడ్డి, వైసీపీ కన్వీనర్ బోయ నాగేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

2 అడుగుల దారిలో అంత్యక్రియలు ఎలా..?

విశాలాంధ్ర-యాడికి : యాడికి మండలం లక్షుంపల్లె గ్రామంలో దళిత స్మశాన వాటికకు వెళ్లే దారి కేవలం 2 అడుగుల వెడల్పు ఉన్న మార్గంలోనే అంత్యక్రియల కోసం శవాన్ని తీసుకెళ్లాల్సి వస్తుండటంపై గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు. సమస్యపై సంబంధిత శాఖలను ప్రశ్నిస్తే కోర్టు పరిధిలో ఉంది అని అధికారులు సమాధానమిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం జీవించి ఉన్న మనిషికి ఎంత స్వేచ్ఛ ఉందో, మరణించిన తర్వాత అంత్యక్రియలకు కూడా అదే హక్కులు ఉండాలని స్పష్టంగా పేర్కొనబడింది. అయితే లక్షుంపల్లెలో జరుగుతున్న పరిణామాలు రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘిస్తున్నాయన్న అభిప్రాయం గ్రామంలో వ్యాప్తి చెందుతోంది. స్మశానానికి పోయే దారి ఏర్పాటుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరాజు, గిరి, గుర్రప్ప, ఆదినారాయణ, నాగరాజు డిమాండ్ చేస్తున్నారు.

పట్టాదారు పాసుపుస్తకం మంజూరు..

విశాలాంధ్ర-రొళ్ల: మండలంలో 2024 డిసెంబర్ నెల లోపు అంత కంటే పూర్వం సదాబైనమల (తెల్లకాగితంలో అగ్రిమెంట్ తరహాలో) సంబంధించిన భూములు రాయించుకున్న వాటికి శాశ్వతంగా యజమాని పేరు మీదా పట్టాదారు పసుపుస్తకం మంజూరు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్లు తహసీల్దార్ షేక్షవాలి తెలిపారు. ఆలాంటి రైతులు ఎవరైన ఉంటే 2027 డిసెంబర్ 31లోపు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అర్జీల ద్వారా సమర్పించుకోవాలని తెలిపారు.భూమి అర్హత వర్గీకరణ వంటి అంశాలను తహసీల్దార్ స్థాయి విచారణ ద్వారా నిర్ధారించబడుతుందని తెలియజేశారు. రత్నగిరి రెవెన్యూ గ్రామం పరిధిలోని భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప,రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు..

అనాథ ఆశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-గోరంట్ల: ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని గోరంట్ల మండలంలోని మంజుల ఉమెన్ వెలోరీ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం, అనాథాశ్రమంలో నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్, నేషనల్ జనరల్ సెక్రెటరీ స్వప్న పాలక ఆదేశాల మేరకు అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బి.రాజేశ్వరి ఏపీ స్టేట్ ఉమెన్ పోర్ట్ ఇంచార్జ్, రెడ్డివారి రాజారెడ్డి రాయలసీమ జనరల్ సెక్రెటరీ (గోరంట్ల వైస్ ప్రెసిడెంట్),ప్రెసిడెంట్ సంధ్య జ్యోతి ఉమెన్ శ్రీ సత్యసాయి డిస్టిక్ ఇన్చార్జ్ వింగ్,ఉమెన్ బెస్త కళ్యాణి శ్రీ సత్యసాయి జిల్లా ఉమెన్ జనరల్ సెక్రెటరీ, రాయలసీమ చైర్మన్ బి.ఎస్ మూర్తి, రాయలసీమ మీడియా సెక్రెటరీ బి.శ్రీనివాసులు, శ్రవణ్ కుమార్ రాయలసీమ కన్వీనర్, పెనుకొండ మండల ప్రెసిడెంట్ మహబూబ్ బాషా,కె.హరీష్ సత్య సాయి వైస్ ప్రసిడెంట్ ఎన్ హెచ్ ఆర్‌సి సభ్యులు విజయ్ కుమార్, ప్రవీణ్ అన్నదాన కార్యక్రమం చేశారు.

జనన ధ్రువీకరణ స్కాంపై ఫిర్యాదు

విశాలాంధ్ర-అగళి : మండలంలోని కొమరేపల్లి గ్రామ సచివాలయం లో జరిగిన జనన ధ్రువీకరణ పత్రాల స్కాంపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎం అండ్ హెచ్ ఓ ఫైరోజా బేగం బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ నిమిత్తం వచ్చిన డిఎం ఎచ్ జనన ధ్రువీకరణ స్కాం పై ఆమె మాట్లాడారు. కేవలం 10 నెలల వ్యవధి లోనే దాదాపు 3982 జనన ధ్రువీకరణ పత్రాలు జారీ కావడంపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, దీనిపై త్వరలో ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు వివరాలు తెలుస్తాయని తెలిపారు.

ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

విశాలాంధ్ర-పెనుకొండ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా శ్రీ సత్య సాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గంలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేసిన పత్రాలను పెనుకొండ మెడికల్ కాలేజీ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించే కార్యక్రమంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉషాశ్రీ చరణ్ మీడియాతో మాట్లాడుతూ జగన్ తీసుకొచ్చిన మెడికల్ కాలేజ్ లను కమీషన్స్ కోసం టీడీపీ ప్రైవేటుకి ఇస్తున్నదని ధ్వజమెత్తారు. 17వ తేదీ జగన్ మోహన్ రెడ్డి గవర్నర్‌ని కలుస్తామన్నారు. పెనుకొండలో దాదాపు 60 ఎకరాలకు పైగా విస్తీర?లో మెడికల్ కాలేజ్ ఉండగా ఎకరానికి 100 రూపాయలకే వాటిని ప్రవేట్ వ్యక్తులకు దార దత్తం చేస్తుంటే, ఇక్కడున్న మంత్రి సవిత కమిషన్లకు కక్కుర్తి పడి అమ్మడానికి సిద్ధమైందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సుధాకర్ రెడ్డి,పట్టణ కన్వీనర్ నరసింహ, తిమ్మయ్య,గజేంద్ర, జడ్పిటిసి ఎంపీపీలో సర్పంచులు ప్రజా ప్రతినిధులు వైఎస్ఆర్సిపి ప్రతినిధులు పాల్గొన్నారు.

కోటి సంతకాల పత్రాలతో బుద్ధి చెప్తాం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన సంతకాల సేకరణ పత్రాలను గవర్నర్‌కు పంపుతామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కు తగిన గుణపాఠం చెప్తామని వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. కోటి సంతకాలతో కూడిన పత్రాలను కళ్యాణదుర్గం లోని వైసీపీ కార్యాలయం నుండి అనంతపురం జిల్లా వైసీపీ కార్యాలయానికి గురువారం తరలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, వైసీపీ పట్టణ కన్వీనర్ సుధీర్, నాయకులు హనుమంతరెడ్డి, నరేంద్రరెడ్డి, భీమేష్, హనుమంతరాయుడు, డీసీ పల్లి నరేష్, పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామ లయన్స్ క్లబ్ సభ్యులు బుధవారం పారిశుద్ధ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు . లయన్స్ క్లబ్ సభ్యుడు సిలారు రాజశేఖర్ పారిశుద్ధ కార్మికులకు దుస్తులు అందించగా, ఎల్ఐసి ప్రసాద్ చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సేవలను కొనియాడరు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ శెట్టి, ట్రెజరర్ అల్లా బకాష్, రవి ప్రసాద్, సత్యనారాయణ, కూచి సూర్యనారాయణ, కులశేఖర్, రామకృష్ణ, రాజశేఖర్, పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని,పార్లమెంటులో ఆర్ టి ఈ యాక్ట్ సెక్షన్ 23(1)ను అమెండ్మెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, సింగల్ టీచర్ సమస్యలు పరిష్కరించాలని, ఇప్పటికే బదిలీలు పొంది వారి స్థానాలలో కొత్తవారు రాక అక్కడే కొనసాగుతున్న టీచర్లను వెంటనే బదిలీ అయిన స్థానాలకు రిలీవ్ చేయాలని, అదేవిధంగా రెండవ శనివారం, ఆదివారాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించ వద్దని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కాలేజ్ సర్కిల్ నుండి ఆర్డిఓ ఆఫీస్ ఎదుట వరకు ప్రదర్శనగా వెళ్లి అనంతరం ధర్మవరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్, ధర్మవరం డివిజన్ నాయకులు ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, లక్ష్మయ్య ,సురేష్ ,చంద్రశేఖర్, రాంప్రసాద్, లతాదేవి, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

జన సైనికులతోనే పార్టీ అభివృద్ధి

విశాలాంధ్ర-తాడిపత్రి: జనసైనికులతోనే జనసేన పార్టీ అభివ ృద్ధి అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి జనసేన పార్టీ ఆఫీసులో నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తాడిపత్రి జనసైనికులు రాయలసీమ ఎలక్షన్ జోన్ కమిటీ మెంబర్ ఆటో ప్రసాద్, జనసేన పార్టీ జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు అచ్చుకట్ల అల్తాఫ్ మర్యాదపూర్వకంగా కళ్యాణం శివ శ్రీనివాసరావును కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విగ్రహ స్థలంపై వివాదం పరిష్కారం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలో గత రెండు రోజులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ స్థల సేకరణ విషయంలో చిన్న సమస్య రావడంతో తహసిల్దార్ ప్రతాప రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి సూచనలతో స్థల వివాదానికి తెరదించారు. స్థానిక కృష్ణ దేవరాయలు ఎన్టీఆర్ విగ్రహాల ప్రక్కన అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతించారు. స్థానిక టిడిపి నాయకుల, ఎమ్మార్పీఎస్ నాయకుల సమక్షంలో ఎట్టకేలకు విగ్రహ భూమి పూజను నిర్వహించారు. విగ్రహానికి అనుమతి ఇచ్చినందుకు ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట-మంతి కార్యక్రమం వీక్షింపు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన మాట మంతి ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం' మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన, లైవ్ టెలికాస్ట్‌లో అధికారులంతా శ్రద్ధగా వీక్షించారు. పంచాయతీరాజ్, గ్రామీణ ఉద్యోగులతో మాట మంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, పాలనా విధానాలు, గ్రామస్థాయి సమస్యలు పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు బాధ్యతాయుత పరి పాలనపై పవన్ కళ్యాణ్ చేసిన సూచనలపై అధికారులు దృష్టి పెట్టారు. ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ రమణ. పంచాయతీ కార్యదర్శులు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.